11న జిల్లా సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం ఈనెల 11న జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయం, ధాన్యం కొనుగోలు, పశుసంవర్ధక శాఖ, గృహ నిర్మాణం, వైద్య ఆరోగ్య శాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖ, ఉపాధి హామీ - కన్వర్జెన్స్, జలవనరుల శాఖ, తాగునీటి సరఫరా, విద్యా శాఖ, సమగ్ర శిక్ష, సంక్షేమ పథకాలు-డిఆర్‌డిఎ, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై సమీక్ష జరుగుతుందని వెల్లడించారు.

అజాగ్రత్తగా ఉంటే ఆరోగ్యానికి చేటు

- జిల్లాలో కరోనా కేసు నమోదు
- పండగ షాపింగ్‌లతో పెరుగుతున్న రద్దీ
- సంక్రాంతికి పెరగనున్న రాకపోకలు

అప్రమత్తంగా మెలగాలంటున్న వైద్యాధికారులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/విజయనగరం కోట

మళ్లీ కరోనా కలవరం మొదలైంది. జిల్లా వాసులు ఉలిక్కిపడుతున్నారు. అజాగ్రత్తగా ఉంటే ఆరోగ్యానికే ప్రమాదం వాటిల్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఒమిక్రాన్ సబ్ వేరియంట్ (బిఎఫ్ 7) వైరస్ వ్యాప్తి చెందుతున్నట్టు సుమారు పదిహేను రోజుల క్రితమే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో విదేశాల నుంచి వచ్చినవారికి, వెళ్తున్నవారికి ఎయిర్‌పోర్టుల్లో కోవిడ్ టెస్టులు తప్పని సరిచేసిన విషయం విధితమే. ఇటీవల ఆస్ట్రేలియా నుంచి మన జిల్లాలోని బొండపల్లి మండలం గరుడబిల్లి గ్రామానికి వచ్చిన దంపతులకు విశాఖ ఎయిర్‌పోర్టులో చేసిన పరీక్షల్లో కరోనా పాజిటివ్ రిపోర్టు వచ్చింది. విషయం తెలుసుకున్న వైద్యారోగ్య శాఖ అధికారులు మరోసారి ఆ ఇద్దరికీ ఆర్‌టిపిసిఆర్ టెస్టులు నిర్వహించడంతో భార్యకు పాజిటివ్, భర్తకు నెగిటివ్ కరోనా రిపోర్టులు వచ్చాయి. కరోనా వేరియంట్ ఏమిటనేది ఇంకా నిర్ధారణ కావాల్సివుంది. శాంపిల్‌ను జినమ్ సీక్వెన్సీ పరీక్షల నిమిత్తం విజయవాడలోని సిద్ధార్థ లేబొరొటరీకి పంపినట్టు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రమణ కుమారి స్పష్టం చేశారు. ఈ పరిణామం నేపథ్యంలో ప్రయాణ సమయాల్లోనూ, షాపింగ్, రద్దీతో కూడిన సభలు, సమావేశాలు, మార్కెట్ల వద్ద జనం అత్యంత జాగ్రత్తగా మెసలుకోవాల్సివుంది.

కరోనా వచ్చిన మొదటిలో జిల్లా పరిస్థితి ఒక్కసారి అవగతం చేసుకుంటే... 2019 డిసెంబర్‌లో ఫస్ట్‌వేవ్ కరోనా రాష్ట్రమంతా బయటపడినప్పటికీ, జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో 2020 మేనెల వరకు జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గ్రీన్ జోన్‌లో ఉండడంతో జిల్లా వాసులంతా జరభద్రంగా ఉన్నారు. మే 20న బలిజిపేట మండలం చిలకలపల్లిలో ఒక పాజిటివ్ కేసు నమోదైంది. అనంతరం వ్యాప్తి చెందడంతో జిల్లా అతలాకుతలమైంది. జనం భయం గుప్పెట్లో బతికారు. జనాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. లాక్‌డౌన్ వల్ల నిత్యవసర సరుకులు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. వలస కార్మికులు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రెండో దశ కరోనాలో ఒకానొక దశకు వచ్చేసరికి వైద్యసేవలు అందించలేని పరిస్థితి. బెడ్స్ దొరక్క, ఇళ్ల వద్దకు వైద్యసేవలు, మందులు అందక మరణాల పరంపర కొనసాగింది. మొత్తంగా ఇప్పటి వరకు కరోనా వల్ల జిల్లాలో 654మంది చనిపోయారు. భార్యా,భర్తలు, తల్లీపిల్లలు చనిపోయారు. కడచూపునకు నోచుకోలేని పరిస్థితి ఎదురైంది. లక్షలాది మంది కరోనా భారిన పడ్డారు. ఆయా సందర్భాల్లో వైద్యసేవల కోసం చేసిన అప్పులు ఇప్పటికీ తీర్చుకోలేక అప్పుల ఊబిలో సతమతమౌతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మళ్లీ కరోనా కేసులు నమోదవుతుండడంతో జనాల్లో భయాందోళన మొదలైంది. కరోనా పట్ల భయం కన్నా జాగ్రత్తలు అత్యంత కీలకమైని వైద్యులు, అధికారులు చెబుతున్నారు.

ముఖ్యంగా సంక్రాంతి పండగ దగ్గరపడుతుండడంతో దుస్తులు, సరుకుల కొనుగోలు దారులతో దుకాణాలు, షాపింగ్‌మాల్స్ కిటకిటలాడుతున్నాయి. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, రాజాం, పాలకొండ తదితర పట్టణాల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. రాకపోకలతో ఆర్టీసి, ప్రైవేటు వాహనాలు కూడా రద్దీగానే ఉన్నాయి. త్వరలో వలస కార్మికులు, ఉద్యోగ, వ్యాపార రీత్య ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు అధిక సంఖ్యలో జిల్లాకు రానున్నారు. ఈనేపథ్యంలో ప్రయాణం, షాపింగ్ సమయాల్లో అత్యంత దగ్గరగా మెసలుకోవాల్సిన పరిస్థితి ఎదురౌతుంది. ప్రస్తుతం కరోనా మహమ్మారి మరోసారి జడలు విప్పుతున్న పరిస్థితుల్లో కాసింతైనా భౌతిక దూరం పాటించడంతోపాటు మాస్కులు ధరించడం, శానిటైజర్ల వినియోగం అత్యంత కీలకంగా మారింది. కరోనా లక్షణాలు కనిపించిన వెంటనే కుటుంబ సభ్యులు లేదా ఇతరులకు దూరంగా ఉంటూ టెస్టులు చేయించుకోవాల్సివుంది.

కరోనా నిబంధనలు పాటించాలి

డిఎంహెచ్‌ఒ రమణ కుమారి

జిల్లాలో తాజాగా ఒక కరోనా కేసు నమోదైన నేపథ్యంలో ప్రజలంతా నియంత్రణ నిబంధనలు పాటించాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి స్పష్టం చేసారు. ప్రస్తుత వాతావరణం పొగమంచు తో కూడి ఉందని , దానివలన జలుబు, దగ్గు, జ్వరం వచ్చే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వేడిగా ఉన్న ఆహారాన్ని భుజించాలని, కోవిడ్ లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. బుధవారం తన ఛాంబర్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జనవరి 1 న బొండపల్లి కి చెందిన భార్య భర్తలు ఆస్ట్రేలియా నుండి సింగపూర్ మీదుగా విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో దిగారని, వారికి రాపిడ్ పరీక్షలు చేయగా ఇద్దరికీ పాజిటివ్ వచ్చిందని, ఆ తర్వాత ఆర్.టి.పి.సి.ఆర్ పరీక్ష చేయగా భార్యకు పాజిటివ్, భర్తకు నెగిటివ్ వచ్చిందని తెలిపారు. వారిని బొండపల్లిలో హోం ఐసోలేషన్ లో ఉంచి వైద్యుల పర్యవేక్షణ చేస్తున్నారని, వారిద్దరూ ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. వీరు 3 డోస్ లలో వాక్సినేషన్ వేయిన్చుకున్నప్పటికీ కోవిడ్ వచ్చిందని కావునా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 80 శాతం మందికి వాక్సినేషన్ పూర్తి అయ్యిందని, మిగిలిన వారు కూడా ముందుకు వచ్చి వాక్సిన్ వేయించుకోవాలని, వాక్సిన్ వేయించుకున్న వారికి కోవిడ్ వచ్చినా ప్రమాదం తగ్గుతుందని తెలిపారు. వాక్సిన్ వేయించుకున్న వారు కూడా మాస్క్ తప్పనిసరిగా వాడాలని , చేతులు తరచుగా కడుక్కోవాలని, భౌతిక దూరాన్ని పాటించాలని అన్నారు. పండగలు వేడుకలకు అవసరమైతే తప్పా దూరంగా ఉండడం మంచిదని తెలిపారు. లక్షణాలు కనిపిస్తే టెస్టులు చేయించుకోవాలి.

నెల్లిమర్ల తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్ణీత కాలవ్యవధిలో రీసర్వే

కలెక్టర్ ఎ.సూర్యకుమారి • మండలాల్లో సర్వే ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-గుర్ల, నెల్లిమర్ల, మెరకముడిదాం

జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద జిల్లాలో చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బంధీగా నిర్వహించి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని, అధికారులను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఆమె బుధవారం పలు మండలాల్లో రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, మెరకముడిదాం, దత్తిరాజేరు మండలాల్లో కలెక్టర్ పర్యటించారు. రీ సర్వే ప్రక్రియపై ఆయా మండల తాశీల్దార్లు, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో, తాశీల్దార్ కార్యాలయాల్లో సమీక్షించారు. సర్వే ప్రక్రియ జరుగుతున్న తీరును, ఇబ్బందులను తెలుసుకున్నారు. ఇంటర్ నెట్ స్పీడుపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడంతోపాటుగా, రికార్డు వర్కు, ఆన్‌లైన్ వర్కును కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, రికార్డులను పకడ్బంధీగా రూపొందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఆయా మండలాల తాశీల్దార్లు రమణరాజు, తాడ్డి గోవింద, డి.రత్నకుమార్, రమేష్, డిప్యూటీ తాశీల్దార్లు సూర్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

నెల్లిమర్లలోని ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి బుధవారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన, తాళాలను, సీళ్లను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, తాహశీల్దార్ రమణరాజు, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ మహేష్ పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన డిఐజి రవికిరణ్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి సబ్ జైలును జైళ్ల శాఖ డిఐజి ఎంఆర్ రవికిరణ్ బుధవారం సందర్శించారు. జైల్లో రికార్డులను పరిశీలించారు. జైలు నిర్వహణ, ఖైదీల పరిస్థితి, ఖైదీలకు అందిస్తున్న ఆహారం, సౌకర్యాలు పరిశీలించారు. విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సౌకర్యాలపై సబ్ జైలర్ పాత్రో వివరించారు.

వీరభద్రస్వామికి వినతినిస్తున్న రెడ్డి శంకర్రావు, ఎంవిఎన్ వెంకటరావు

ఎంఆర్ లా కళాశాలను కొనసాగించాలి

డిప్యూటీ స్పీకర్‌కు పట్టణ పౌరసంక్షేమ సంఘం వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంఆర్ లా కళాశాల మూతపడకుండా కొనసాగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, లా కళాశాల పూర్వ విద్యార్థి ఎంవిఎన్ వెంకటరావు కోరారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు, దేవాదాయ కమిషనర్ ఇఒ ప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న ఏకైక 'లా' కళాశాల అడ్మిషన్‌లను 2023 కౌన్సిలింగ్ జాబితానుంచి తొలగించారని తెలిపారు. దీన్నిబట్టి వచ్చే ఏడాదినుంచి కళాశాలను ఎత్తి వేసేందుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. ఫలితంగా ఈ ఏడాది జాయిన్ కావలసిన విద్యార్థులకు లా చదువు కోనే అవకాశం కోల్పోయారని తెలిపారు. 36 ఏళ్లుగా కొనసాగుతున్న ఎంఆర్ లా కళాశాలను ఎత్తివేసి విద్యల నగరంగా పేరు గాంచిన జిల్లా పేరు ను భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. కళాశాలను కొనసాగించేందుకు కృషి చేయాలని కోలగట్లను కోరారు. కార్యక్రమంలో పిపిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షులు వర్రి రామచంద్రరావు. కార్యదర్శి రెడ్డి శంకరరావు , నగర అధ్యక్షులు కంది త్రినాథ్ లు పాల్గొన్నారు..

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ

- ఓటర్ల నమోదు, తొలగింపు జరగని పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాలి
- ఓటర్ల జాబితా పరిశీలకులు అహ్మద్ బాబు సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు అహ్మద్‌బాబు

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో ఒక్క ఓటు కూడా నమోదు, తొలగింపు జరగని పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని, సవరణ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని ఓటర్ల జాబితా పరిశీలకులు అహ్మద్ బాబు ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలను ఆదేశించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులతో సమీక్ష జరిపి కొత్తగా ఒక్క ఓటరు కూడా నమోదు కాకపోవడానికి, ఒక్క ఓటు కూడా తొలగింపు చేపట్టక పోవడానికి కారణాలు తెలుసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి అప్పగించిన బాధ్యతలను సీరియస్ గా తీసుకోవాలని బిఎల్‌ఒలుగా నియమితులైన సచివాలయం సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. సాధారణ, ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ఆయన బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంలో కూడా గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్లకు ఫోటో గుర్తింపు కార్డులు జారీ, ఓటర్లు, జనాభా నిష్పత్తి తదితర అంశాలపై పరిశీలకులు సమీక్షించారు. పనితీరు సరిగా లేని బిఎల్‌ఒలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందిస్తూ సున్నా పురోగతి సాధించిన బిఎల్‌ఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని బదులిచ్చారు. పరిశీలకులు బాబు మాట్లాడుతూ ఓట నమోదు, సవరణ ప్రక్రియకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. అందరూ సమన్వయంతో పని చేయాలని జాబితాల రూపకల్పనలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులపై బెదిరింపులు మానుకోవాలి

ఎంఆర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫీజుల పెంపు తదితర సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థుల పట్ల బెదిరింపులకు పాల్పడుతూ, వారికి యాజమాన్యం నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం కళాశాల వద్ద ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఎంఆర్ డిగ్రీ కాళాశాలలో ఫీజుల సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వీటి పరిష్కారానికి కాలేజి ప్రిన్సిపల్‌ను ప్రశ్నించిన విద్యార్థులకు సోకాజు నోటీసులు ఇవ్వడం,విద్యార్థులకు పరీక్షల సమయంలో హాల్ టిక్కెట్లు ఆపేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే మాన్సాస్ యాజమాన్యం ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాదీవేన తల్లి అకౌంట్‌లో పడితేనే కళాశాల ఫీజు కట్టాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్సా సత్యన్నారాయణ తెలిపారని అన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ ఐ అధ్యక్ష, కార్యదర్శులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము, సహాయకార్యదర్శి ఎం.హర్ష, నాయకులు రాజు, రమేష్, వెంకటేష్, సోమేష్, మణికిరణ్, డివైఎఫ్ఐ నాయకులు సతీష్ పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర కమిటీలో ఆరుగురికి చోటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా జిల్లా నుంచి ఆరుగురు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా టివి రమణ, యుఎస్ రవికుమార్ ఎన్నికయ్యారు.

ఇంటర్ విద్యార్థులకు వృత్తివిద్యా శిక్షణ పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఇంటర్ వృత్తివిద్యా కోర్సు విద్యార్థులకు అందించిన పదిహేను రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. నెల్లిమర్లలోని సి.కె.ఎం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ కోర్సులో చేరిన 38 మంది మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్ షిప్ శిక్షణను సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఇచ్చారు. సమాచార శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.మల్లేశ్వరరావు, సహాయ ఇంజనీర్ ఎ.శ్రీలక్ష్మి తదితరులు రేడియో సర్క్యూట్‌లు, టి.వి.సర్క్యూట్‌లు, హై పవర్ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్ సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలతో మరింతగా విజ్ఞానాన్ని సంపాదించి ఆయా వృత్తిలో మంచి టెక్నీషియన్లుగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు పి.జానకి పాల్గొన్నారు.

నేడు టిడిపి నిరసన

విజయనగరం కోట : చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు సభలు, సమావేశాలను నిషేదిస్తూ ప్రభుత్వంజారీ చేసిన జీవోకు వ్యతిరేకంగా టిడిపి ఆధ్వర్యాన అంబేద్కర్ జంక్షన్ వద్ద గురువారం నిరసన తెలుపుతామని పార్టీ పార్లమెంట్ స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు. స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు కు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, కంది మురళి నాయుడు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ చైర్మన్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-రామభద్రపురం

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు హఠాన్మరణం మూడు జిల్లాల పాడి రైతులకు తీరని లోటని స్థానిక డైయిరీ డైరెక్టర్ శంబంగి అమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. తులసీరావు మరణ వార్త బుధవారం సాయింత్రం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి చెందామని డెయిరీ మేనేజర్ రామచంద్రరావు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా అమ్మలు మాట్లాడుతూ నిరంతరం పాడి రైతుల శ్రేయస్సే కర్తవ్యంగా భావించి పాల విప్లవం తీసుకు వచ్చి ఆంధ్రా కురియన్ గా ప్రసిద్ధి గాంచారనీ కొనియాడారు. రైతులకు అన్ని సదుపాయాలు కలుగ జేసేందుకు ఎక్కడా లేని విధంగా డెయిరీ ఉద్యోగాలన్నీ పాడి రైతుల పిల్లల తోనే భర్తీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రైతు శ్రేయస్సుకు పెద్ద పీట వేస్తూ రైతుల ఆరోగ్య సమస్యలు తీర్చేందుకు కృషి ఆసుపత్రిని నెలకొల్పి అత్యాధునిక వైద్య సదుపాయాలు అందజేస్తూ అంచెలంచెలుగా విస్తరిస్తూ నేడు ఐకాన్ ఆసుపత్రిగా అభివృద్ధి చేసిన ఘనత తులసీరావుకే దక్కుతుందన్నారు. విద్యార్థుల చదువులకు విద్యాలయాల సదుపాయంతో పాటు, అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు అందజేస్తూ వివిధ పోటీ పరీక్షల కోసం ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి వేల మంది విద్యార్థుల చదువులకు పరోక్ష సహాయం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా తులసీరావు మృతికి సంతాపం ప్రకటించి స్థానిక యూనిట్ మేనేజర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో మౌనం పాటించారు.

డెంగీతో గురుకుల విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-వంగర

మండలంలో శ్రీహరిపురానికి చెందిన మజ్జి రితిక (14) డెంగీతో మృతి చెందింది. నిరుపేదలైన మజ్జితవుడు, నవితకు రితిక, జోసఫ్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. రిషిత మండలంలోని మడ్డువలస అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కుమారుడు జోసఫ్ సంతకవిటి మండలంలోని గుల్ల సీతారాంపురంలో ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల డెంగీ జ్వరం బారిన పడడంతో పాఠశాల సిబ్బంది వంగరలోని పిహెచ్‌సికి తీసుకువెళ్లారు. తర్వాత తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు రాజాంలో గల కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖలో గల కెజిహెచ్‌కు తరలించడంతో అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ జ్వరంగా నిర్ధారించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



సమస్యలు తెలుసుకుంటున్న కోలగట్ల

'గడపగడపకు..'లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 12వ డివిజన్‌లో బుంగవీధిలో బుధవారం జరిగిన గడప గడపకూ కార్యక్రమంలో ప్రజలు పలుసమస్యలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి విన్నవించారు. తొలుత ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును పరిశీలిస్తూనే, వాటి వివరాలతో కూడిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా స్థానిక సమస్యలను డిప్యూటీ స్పీకర్ దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. రహదారులు ఏర్పాటు చేయాలని, కాలువలు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిప్యూటీ స్పీకర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే తమ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, ముద్దాడ మధు, మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ రేగాన రూపా దేవి, స్థానిక వైసిపి నాయకులు బొంగ భానుమూర్తి, నమ్మిగోపి, డొంకాడ పద్మావతి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు ప్రారంభం

నగరంలోని 43వ డివిజన్ ఉడా కాలనీలో రూ.25లక్షలతో ఏర్పాటు చేసిన సిసి రోడ్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో సంపూర్ణ మౌలిక వసతులు కల్పించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. నగరంలో అనేక ప్రధాన జంక్షన్ అభివద్ధి చేశారన్నారు. స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి మాట్లాడుతూ తమ డివిజన్లో ప్రజల కోరిక మేరకు అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు వింత ప్రభాకర్ రెడ్డి, వైసిపి నాయకులు నారాయణప్పడు, పిన్నింటి సూర్య నారాయణ, వంతరం సురేష్ పాల్గొన్నారు.

అంధుల ఆరాధ్యదైవం లూయిస్ బ్రెయిలీ

విజయనగరం : అంధులపాలిట ఆరాధ్యదైవం లూయిస్ బ్రెయిలీ అని జిల్లా సహితవిద్య సమన్వయకర్త ఎస్. సూర్యారావు అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని స్థానిక కల్యాణంద భారతి మున్సిపల్ కార్పోరేషన్ పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో బుధవారం వికలాంగుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బ్రెయిలీ లిపి ఎంతోమంది అంధుల జీవితాలకు వెలుగును పంచిందన్నారు. బ్రెయిలీ ద్వారా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకున్నవారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహితవిద్య సహ సమన్వయకర్త ఎం. భారతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, సహితవిద్య ఉపాధ్యాయులు ఎన్. బంగారునాయుడు, ఎస్. ఈశ్వరరావు పలువురు తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఘనంగా బ్రెయిలీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ తిరుమల ప్రసాద్ హాజరై బ్రెయిలీ చరిత్రను, ఆయన ప్రపంచానికి చేసినటువంటి కృషిని వివరించారు. అనంతరం బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎపిఎస్ఆర్‌టిసి అందించిన ఉచిత బస్ పాసులను వికలాంగ విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు అచ్యుతరావు, రాజేశ్వరి, కళావతి, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల ఆన్‌లైన్

బొబ్బిలి : స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికేట్స్ ఆన్‌లైన్ చేస్తున్నారు. జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 28 లోగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికేట్స్ ఆన్‌లైన్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో పెన్షనర్ల సౌకర్యం కోసం రిటైర్డ్ ఎటిఒ సమక్షంలో లైఫ్ సర్టిఫికేట్స్ ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రౌతు రామమూర్తి కోరారు.

8న నవనీత సేవ

బొబ్బిలి : శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 8న నవనీత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, యువరాజా బేబినాయన తెలిపారు. ఆ రోజు ఆలయంలో ఉన్న మూల విరాట్ విగ్రహాన్ని వెన్నతో అలంకరించి భక్తులు దర్శనానికి పెడతామన్నారు. నవనీత సేవను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వెన్న నిలబడేలా గర్భగుడిలో ఏసిలు, ఐస్ బాక్సులు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి స్వామివారిని దర్శించుకోవచ్చునని తెలిపారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

బొబ్బిలి : మున్సిపాలిటీలో పెండింగులో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సచివాలయ, మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాలు వారీగా అభివృద్ధి పనులు ప్రారంభించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులు ప్రారంభించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కాంట్రాక్టర్లను కోరారు.

నాడు-నేడు పనుల పరిశీలన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు రెండవ విడత పనులను బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. బాల భాస్కర్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కామేష్, సచివాలయం అసిస్టెంట్ ఇంజనీర్ జయ ప్రకాష్, సిఆర్‌పి కాట్రపల్లి రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఖాళీ షాపులకు టెండర్లు

బొబ్బిలి : మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులకు టెండర్లు పిలిచి అద్దెలకు ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీ షాపులను బుధవారం ఆయన పరిశీలించారు. ఖాళీగా ఉన్న 10షాపులకు టెండర్లు వేసి అద్దెకు ఇవ్వాలన్నారు. టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్ఓ ప్రసాద్‌ను కోరారు. షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్న చెత్తను తొలగించాలన్నారు. ఆయనతో మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

ఇన్‌స్టిట్యూట్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

శృంగవరపుకోట : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో వాసవి పాఠశాలలో వాసవి పాఠశాలతో పాటు ఎపి ఇనిస్టిట్యూట్, త్రినేత్ర పాఠశాల అనే పేరుతో మూడు సంస్థలను నడుపుతున్నప్పటికీ విద్యాశాఖాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాసి పాత్రుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధిరి కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర్ రెడ్డికి బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పాత్రుడు మాట్లాడుతూ ఇదే సంస్థ పై గతంలో ఫిర్యాదు చేశామని అందులో భాగంగా డిప్యూటీ డిఇఒ వాసుదేవరావు వచ్చి పరిశీలన చేశారని 50 మంది విద్యార్థులు అనాధికారికంగా ఉన్నట్లు గుర్తించామని తెలియజేశారని అయినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. వారిపై ఇప్పటికైనా చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. దీనికి డిఇఒ స్పందిస్తూ తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పాత్రుడు తెలిపారు.

చంద్రబాబుపై అధికార పార్టీ తీరు అమానుషం

నెల్లిమర్ల : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పై అధికార వైసిపి తీరు అమానుషమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడారు. చంద్రబాబు కుప్పం పర్యటనలో పోలీసులు అమానుషంగా వ్యవహరించారని తెలిపారు. ముఖ్యంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో సభలు, సమావేశాలు పెట్టుకొనే అర్హత లేదా అని ప్రశ్నించారు. చేతిలో అధికారం ఉందని, పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలికి చంద్రబాబు, కార్యకర్తలపై జులుం చేయడం దారుణమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షాలను అణగదొక్కడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఇప్పటికే ప్రతిపక్షాలపై అధికార వైసిపి చేస్తున్న దాడుల హత్య రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పోలీసుల తీరు అమానుషం

కుప్పం నియోజకవర్గంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని టిడిపి బొబ్బిలి నియోజకవర్గం ఇంఛార్జి బేబినాయన బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. అప్రజాస్వామిక వ్యతిరేక జీవో నెంబర్-1ని విడుదల చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

గణిత కేలండర్ ఆవిష్కరణ

బాడంగి : ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో తయారు చేసిన గణిత కేలెండర్‌ను ఎంపిడిఒ కె.అక్కారావు బుధవారం ఆవిష్కరించారు. ఈ గణిత కేలెండర్ విశిష్టతను రాష్ట్ర గణిత ఫోరమ్ గౌరవ అధ్యక్షులు సిద్దాంతం త్రినాథరావు వివరించారు. కార్యక్రమంలో గణిత ఫోరమ్ ప్రతినిధులు సత్యన్నారాయణ, సింహాచలం, మోహన్, ఈశ్వరరావు, రమేష్, రవి, దుర్గా ప్రసాదరావు పాల్గొన్నారు.

దెందేరులో గ్రామసభ

కొత్తవలస : మండలంలోని దందేరు గ్రామంలో బుధవారం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ విరోతు వెంకటరమణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామంలో కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.25 లక్షలు, వాటర్ ట్యాంక్‌కు రూ.28 లక్షలు, ఇంటింటి కుళాయికు రూ. 99 లక్షలు మంజూరయ్యాయన్నారు. వీధి దీపాలు, కాలువలు అన్ని విషయాల్లో అభివృద్ధికి ముందడుగు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దారపు చెన్నయ్య, వైస్ సర్పంచ్ కనకమహాలక్ష్మి, పంచాయతి సెక్రటరీ లీలావతి, పాఠశాల హెచ్ఎం సునీత, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వేపాడలో ఉచిత వైద్య శిబిరం

వేపాడ : మండల కేంద్రంలో బుధవారం స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ శిబిరాన్ని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిని ఎ.ధరణి, సిహెచ్ఒ జివిఎస్ఆర్ ఆంజనేయులు, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.పి రాజ్యలక్ష్మి, డి. స్వాతి, కె. లావణ్య, సిహెచ్ జానకి, హెల్త్ అసిస్టెంట్ సిహెచ్ సుధా నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ వివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు అన్నారు. ఘనంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 252 పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పెంపుదలకు కట్టుబడి ఈనెల నుంచి ఇచ్చిన మాట ప్రకారం రూ.2,750కు పెంచామన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలకోసం నాయకులు చుట్టూ తిరగాల్సి వచ్చేదని వైసిపి ప్రభుత్వం వచ్చాక అన్ని రకాల సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, నియోజక వర్గం పరిశీలకులు అంధవరపు సూరి బాబు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఎండిఒ జి. గిరిబాల, ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీ రావు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

కారంకి ఫౌండేషన్‌కి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభినందన

తండ్రిని కోల్పోయి నిరాశ్రయులైన ముగ్గురు ఆడపిల్లలకు రూ.లక్ష సుకన్య సమృద్ధి యోజన పథకంలో జమ చేసిన కారంకి పౌండేషన్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు బుధవారం అభినందించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరి బాబు, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ రైల్వే బోర్డ్ సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, తహశీల్దార్ కెవి రమణరాజు, కెజిబివి ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ చెరుకు కాటా వద్ద ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపిపి దొగ్గ సత్యవంతుడు అధ్యతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా 235 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందచేయడంలో ముందున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వివి చిన్న రామునాయుడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మూకల కస్తూరి, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, నెట్ కేఫ్ డైరెక్టర్ చలమూరు పద్మ, వైస్ ఎంపిపిలు అడప ఈశ్వరరావు, దాయారల ముత్యాలమ్మ మండల వైసిపి అధ్యక్షులు జగన్నాథం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మెరుపుల సత్యనారాయణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకట్రావు, పిఎసి చైర్మన్ రామ్మూర్తి నాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యలోనే వెళ్లిపోయారు

- తూతూ మంత్రంగా గడపగడపకు..
- అసహనం వ్యక్తం చేసిన గ్రామస్తులు

ప్రజాశక్తి - భోగాపురం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు కార్యక్రమం లక్ష్యం పక్కదారి పడుతోంది. నేరుగా గ్రామాల్లోని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను, సంక్షేమ పథకాల అందుతున్న తీరును తెలుసుకోవాలని ఎమ్మెల్యేలకు, స్థానిక అధికారులకు పూర్తిస్థాయిలో ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. బుధవారం మండలంలోని కౌలువాడ పంచాయతీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దీనికి అద్దం పడుతోంది. ఇక్కడ జరగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తూతూ మంత్రంగానే సాగింది. ప్రధాన వీధిలో ఎమ్మెల్యే

తమ వీధి వరకూ ఎమ్మెల్యే రాలేదని చెబుతున్న గ్రామస్తులు

బడ్డుకొండ అప్పలనాయుడు ఇంటింటికి పర్యటించి మిగిలిన వీధుల్లోకి వెళ్లకుండానే ముగించారు. సమస్యలు తెలుసుకునేందుకే జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని అయినప్పటికీ తమ ఇళ్లవైపు రాకపోవడం దారుణమని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని తమ గోడును ఎమ్మెల్యేకు వివరించుకునే ఇటువంటి అద్భుతమైన అవకాశాన్ని కోల్పోయామని మహిళలు నిరాశ వ్యక్తం చేశారు. ఇకనైనా జరగబోవు కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో చేపడితే ప్రభుత్వ ప్రతిష్టతకు భంగం వాటిల్లకుండా ఉంటుం దని పలువురు గ్రామస్తులు, మహిళలు అంటున్నారు. గ్రామానికి చెందిన మరో మహిళ వాలంటీర్ పోస్టుకు సంబంధించిన నోటిఫికేషన్ ఎవరికీ తెలియకుండానే భర్తీ చేస్తున్నారని ఇది సరికాదని, పార్టీలకు అతీతంగా కులమతాలు చూడకుండా చక్కటి పరిపాలన అందించాలని జగన్మోహన్ రెడ్డి చెబుతుంటే ఇక్కడ అందుకు విరుద్ధంగా సాగుతుందని ఎమ్మెల్యేను పలువురు ప్రశ్నించారు. అనంతరం వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నడిపించి మమ అనిపించారు.

అలమండలో గడపగడపకు

ప్రజాశక్తి - జామి

మండలంలోని అలమండ గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. సమస్యలను పరిష్కరించే దిశగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామ న్నారు. పలువురి సమస్యలపై తక్షణమే స్పందించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలు అందలేదని ఇబ్బంది పడకూడదన్నారు. ఎవరికైనా పథకాలు రాకపోతే సచివాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, మండల పార్టీ కన్వీనర్ గొర్లె రవి కుమార్, అలమండ సూరిబాబు రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, స్థానిక సర్పంచ్ కోట పాపమ్మ, వైస్ సర్పంచ్ లగుడు దేముడు, బండారు వెంకటరావు, అప్పలనాయుడు, ఆచారి, ఆనంద్, బండారు రామక్రిష్ణ పాల్గొన్నారు.

పింఛను మంజూరు పత్రాలు అందజేత

విజయనగరంటౌన్ : నగరంలోని కృష్ణరాజపురం 35వ సచివాలయంలో నూతన లబ్ధిదారులకు బుధవారం పింఛను పత్రాలు,నగదును డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక చిన్న కష్టం కూడా తెలియకుండా, ప్రతినెలా వాలంటీర్ తమ ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్న తీరు పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు గుణ, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి సుజాత, పైడితల్లి అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యులు అచ్చిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఫణి, పప్పు ప్రసాద్, ఓగి రెడ్డి సతీష్, దమయంతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బికె నాయుడుపేట బాలికల వసతి గృహాలకు సౌర విద్యుత్ సౌకర్యం, మండల కేంద్రానికి బస్సు సౌకర్యం, త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు అన్నారు. మండల కేంద్రంలో వల్లంపూడి గ్రామంలో బుధవారం నిర్వహించిన మహిళలు ముగ్గుల పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయనకు పలువురు వినతులు అందించడంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిజెపి విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు ఎం రవీంద్ర, ఎస్ కోట నియోజకవర్గం ఇన్చార్జి ప్రసాద్, వేపాడ మండల అధ్యక్షుడు మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్, దిలీప్ వర్మ పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని నెలకొని ఉన్న దీర్ఘకాల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని బిజెపి రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్. నరసింహారావు అన్నారు. మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జ్‌ని పరిశీలించారు. కొత్తవలసలో రోడ్డు విస్తరణ జరగాలని, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని అధికారులు, నాయకులు చొరవ చూపాలని, పిహెచ్‌సి పనులు త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆయన వెంట కొత్తవలస బిజెపి అధ్యక్షుడు సిహెచ్ అప్పారావు ఉన్నారు.

శృంగవరపుకోట: ఎస్.కోట-అరుకు రోడ్డు విస్తరణతోనే పర్యాటక అభివృద్ధి సాధ్యపడుతుందని రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నర్సింగరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రైవేటు హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో అన్ని సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి గడ్కరీతో మాట్లాడి విశాఖ, ఎస్ కోట - అరకు రోడ్డు విస్తరణకు కృషి చేస్తామన్నారు.

జామి: సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకలని రాజ్య సభ సభ్యులు జి.వి ఎల్ నరసింహారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బజార్ సెంటర్ వద్ద మండల బిజెపి మహిళ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయనకు మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ప్రధానంగా జామి గ్రామం మీదుగా వెళుతున్న రైల్వే కారిడార్ పనులు నిలుపుదల చేసి, మూడు పంటలు పండే భూములను, వాటిపై ఆధారపడ్డ రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు. భీమసింగి సహకార ఫ్యాక్టరీ తెరిపించే చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలుగు నెలల్లో ఉద్యోగాలిస్తాం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నాలుగు నెలల్లో గుంపాం గ్రామస్తులకు ఉద్యోగాలిస్తామని ఐవాక్స్ పేపర్ కెమికల్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంటు శ్రీనువాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని గుంపాంలో ఉన్న మెసర్స్ ఐవాక్స్ పేపర్ కెమికల్స్ యూనిట్‌లో అన్క్‌లైన్ సక్సినిక్ అన్ హైడ్రేడ్ అనే పేపర్ కెమికల్ ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికార్ల అధ్యర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సమావేశంలో డిఆర్‌ఒ గణపతిరావు మాట్లాడుతూ పరిశ్రమలో ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకే ప్రజాభిప్రాయ సేకరణ అన్నారు. ప్రజలు యొక్క సూచనలు, సలహాలు, అభ్యంతరాలు తెలపాలని కోరారు. పరిశ్రమలో తమ గ్రామస్థులకు ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని గ్రామస్థులు కొంతమంది ఆవేదన వ్యక్తం చేసారు. ఈ పరిశ్రమ నుండి వస్తున్న కాలుష్యం వల్ల తమ భూములు పాడైపోతున్నాయని డిఆర్ఒకు తెలిపారు. ఉద్యోగాలతో పాటు, తాగునీరు, సాంస్కృతిక కార్యక్రమాల సమయంలో ఆర్థికంగా సహకారం అందిస్తూ గ్రామాభివృద్ధికి సహకరిస్తే తాము పరిశ్రమకు వ్యతిరేకం కాదని కొంత మంది తెలిపారు. ఈ విషయమై పరిశ్రమ వైఎస్ ప్రెసిడెంటు శ్రీనువాసరావు మాట్లాడుతూ పరిశ్రమ సామర్థ్యం పెరగడంతో ఇకపై గుంపాం గ్రామస్తులకు ఉద్యోగ అవకాశం ఇస్తామని

ప్రజాభిప్రాయ సేకరణలో ఐవాక్స్

సమస్యలను వివరిస్తున్న గ్రామ పెద్ద వెంకటరమణ

సభాముఖంగా తెలుపుతున్నామన్నారు. తమ పరిశ్రమ నుండి వ్యర్థ జలాలు బయటకు రావడం లేదని, వచ్చిన వ్యర్థయ జలాలను గార్డెన్‌కు వాడుతున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలు ఇస్తే వెంటనే పరిశ్రమకు నో అబ్జెక్షన్ పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొత్తకోట వెంకటరమణ, రాకేష్ శర్మ, కంపెనీ ప్రతినిధులు సమీర్ పండా, తహశీల్దార్ ఇమంది బాస్కరావు, ఎస్ఐఎ. నరేష్, పర్యావరణ సామజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుతున్న తాలాడ లావణ్య రాష్ట్ర స్థాయి బాలికల అండర్ -14 తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించింది. గత నెల 28,29,30 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ -1 4బాలికల తైక్వాండో పోటీల్లో లావణ్య ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా లావణ్యను హెచ్ఎంసి.హెచ్. రాధా కృష్ణ, పిఇటి నడిపేన సూర్యనారాయణ, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కాళ్ళ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు బాడంగి విద్యార్థులు

బాడంగి: స్థానిక జెడ్‌పి పాఠశాలలో విజయనగరానికి చెందిన నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కబడ్డీ, వాలీబాల్, పరుగు

బాడంగి: పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పోటీల్లో జిల్లా స్థాయి ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో బాడంగి హైస్కూల్ విద్యార్థులు కబడ్డీ బాలుర విభాగంలో మొదటిస్థానం కబడ్డీ బాలికల విభాగంలో మొదటి స్థానంలోను వాలీబాల్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో 100 పరుగులో బాలురు మొదటి, రెండు స్థానాలు, బాలికలు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అవ్వడంతో పాఠశాల హెచ్ఎం ఎస్ త్రినాథరావు, పీడీ మోహన్ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

బిసిలకు రాజ్యాధికారం దక్కే వరకుపోరాటం

విజయనగరం టౌన్ : విజయనగరం నియోజకవర్గంలో బిసిలకు రాజ్యాధికారం దక్కే వరకు తాను అలుపెరగని పోరాటం చేస్తామని వైసిపి నాయకులు పిల్లా. విజయ్ కుమార్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలో బిసి కులానికి చెందిన ఏ ఒక్కరికి టికెట్ కేటాయించినా తనకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. రింగ్ రోడ్డులో గల తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన జ్యోతిరావు పూలే విగ్రహం పక్కన ఆయన భార్య సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు వచ్చే ఎన్నికల్లో బిసి వర్గానికి టికెట్ కేటాయించేలా కృషి చేయాలని కోరారు. విజయనగరంలో 90 శాతం మంది ఉన్నారని గుర్తు చేశారు.

మైత్రీ మీడియా ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు

విజయనగరం టౌన్ : మన సంస్కృతి, సంప్రదాయాల ఔనత్యాన్ని భావి తరాలకు తెలియజేసే గురుతర బాధ్యతను మైత్రీ మీడియా తీసుకుందని మైత్రీమీడియా యాజమాన్య ప్రతినిధి అవనాపు విక్రమ్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ ఏడాది కూడా మైత్రీమీడియా ప్రేక్షకుల కోసం పలు కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. బుధవారం నగరంలోని కోట జంక్షన్ వద్ద మైత్రీ మీడియా కార్యాలయంలో నిర్వహించిన మిడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10న గుజాడ కళాక్షేత్రంలో రంగోళి కార్యక్రమాన్ని, చిన్నారుల కోసం ప్యాన్సీ డ్రస్ కాంపిటేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రెజర్ హంట్లో పాల్గొన్న వారికి డ్రా తీసి, విజేతలను ఈ సందర్భంగా ప్రకటించారు. వీరికి ఈ నెల 10న బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. రంగోళి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా 50 వేల నగదు, ద్వితియ బహుమతిగా బంగారు నక్లెస్, తృతీయ బహుమతిగా బంగారు చెవిదిద్దులు అందించడంతో పాటు 10 మంది కి కన్సోలేషన్ బహుమతులు- పది జతల వెండి కుందులు బహుమతిగా ఇస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రత్యేక బహుమతులు అందించనున్నామని వెల్లడించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా తొమ్మిదేళ్లలోపు చిన్నారుల కోసం కిడ్స్ ఫ్యాన్సీ డ్రస్ కాంపిటేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫస్ట్ ప్రైజ్ రూ.20 వేలు షాపింగ్ ఓచర్ , సెకెండ్ ప్రైజ్ రూ.15వేలు షాపింగ్ ఓచర్, థర్డ్ ప్రైజ్ రూ.10 వేల రూపాయల షాపింగ్ ఓచర్ అందించడంతో పాటు ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక గిఫ్ట్ హ్యాంపర్ ఇస్తామని తెలిపారు.

టిడిపి హయాంలోనే బిసిల అభ్యున్నతి

ప్రజాశక్తి- గరివిడి

టిడిపి హయామంలోనే బిసి కులాల అభ్యున్నతి, సంక్షేమం జరిగిందని టిడిపి చీపురపల్లి నియోజక్వర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. చీపురపల్లిలోని తన నివాసంలో బుధవారం జిల్లా బిసి విభాగం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి కులాల సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. బిసిలపై కక్ష సాధింపు తప్ప వారి అభ్యున్నతకు వైసిపి ప్రభుత్వం ఏమాత్రం చర్యలు చేపట్టలేదన్నారు. బిసి కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ వారి సంక్షేమానికి నిధులు కేటాయించలేదన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌లకు కనీసం కుర్చీలు ఇచ్చే పరిస్థితి కూడా ఆ ప్రభుత్వంలో లేదన్నారు. కార్పొరేషన్ల వల్ల బిసిలకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. ఈ సమావేశంలో గురవాన నారాయణ రావు, కంది మురళి నాయుడు, అల్లు విజయ కుమార్, మడిమి

సమావేశంలో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

దేవేంద్రనాథ్, వెన్నె సన్యాసి నాయుడు, దంగా భూలోక, గాలి వెంకట రెడ్డి, రౌతు రామూర్తి, దుమ్ము అశోక్, మైలపల్లి సింహాచలం, ముల్లు రమణ, మండల అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం పేరుతో దోచేస్తున్నారు..

ప్రజాశక్తి - శృంగవరపుకోట.

సంక్షేమం పేరుతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. పట్టణంలోని బర్మా కాలనీ, చాకలి వీధిలో బుధవారం మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ఆమె మాట్లాడారు. పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ మోతలతో సామాన్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం బర్మా కాలనీలో సీనియర్ కార్యకర్త సరిపల్లి రాము అనారోగ్యానికి గురైన

ఇంటింట ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల

విషయాన్ని తెలుసుకొని అతని నివాసం వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాపుగంటి శ్రీనువాసురావు ఐటిడిపి రాష్ట్ర సెక్రెటరీ సిహెచ్. కిరణ్, బి శెట్టి అరుణ, టిడిపి నాయకులు పొట్నూరు అప్పలరాజు, ఎన్.బి.రవి, రామకృష్ణ, అప్పారావు, గొర్ల కన్నతల్లి, తదితరలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి : సిఐ

రామభద్రపురం : హిందూ సాంప్రదాయ పద్ధతిలో జరుపుకొనే అతి పెద్ద పండగ సంక్రాంతి వేళ ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఆనంద ఉత్సవాలు జరుపుకోవాలని బొబ్బిలి సర్కిల్ సిఐ తిరుమలరావు కోరారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో ఎంఎస్‌పిలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలకు ఇతర ప్రాంతాలకు వెళ్ళే వారు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్ళకు తాళాలు వేసి వెళ్లిన వారి ఇళ్ళ పై నిఘా ఉంచాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై సమాచారం సేకరించి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియ జేయాలన్నారు. ఉత్సవాల పేరుతో అశ్లీల నృత్యాలు, కోడి, గుర్రపు పందేలు, జూదం వంటివి నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలస ప్రాజెక్టు సమీపంలో బొద్దాన గవరయ్య (67) మృతదేహం బుధవారం లభ్యమయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఈయనది మన్యం జిల్లా పాలకొండ మండలం వడమ గ్రామంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. గవరయ్య కుమార్తే తూముల కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్ సి సన్యాసిరావు తెలిపారు.

గడ్డికుప్పలు దగ్ధం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని చినగుడిపాల లండ వారి కళ్లాల్లో బుధవారం ప్రమాదవశాత్తు లండ అప్పన్న, లండ ముత్యాల నాయుడు ఇద్దరి అన్నదమ్ములకు చెందిన గడ్డి కుప్పలు కాలిబూడిదయ్యాయి. స్థానిక సర్పంచ్ బోజంకి రామునాయుడు, హుటాహుటిన కొత్తవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా తక్షణమే స్పందించిన సిబ్బంది మంటలను అదుపు చేశారు. గత సంవత్సరం కూడా అదే అన్నదమ్ముల గడ్డివాము కాలిపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేలు ఆస్తి నష్టం జరిగిందని, స్థానిక సర్పంచ్ విలేకరులతో చెప్పారు.

వ్యాపారులు, కళాసీల మధ్య తోపులాట

బొబ్బిలి : వేతన ఒప్పందంపై పట్టణ కళాసీలు, వ్యాపారులు మధ్య తోపులాట జరిగింది. వేతన ఒప్పందం డిసెంబర్ 31నాటికి సమయం ముగియడంతో కళాసీలు జనవరి 1 నుంచి సమ్మె చేపట్టారు. రైసుమిల్లు కళాసీల వేతన ఒప్పందం జరిగినప్పటికీ షాపులలో పని చేసే కళాసీల వేతన ఒప్పందం జరగలేదు. దీంతో షాపులు వద్ద పనులను కళాలసీలు అడ్డుకున్నారు. దీంతో వ్యాపారులు, కళాలసీల మధ్య తోపులాట జరిగింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని పట్టణ కళాసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.అప్పలస్వామి, డి.వర్మ కోరారు. ఇతర ప్రాంతాలు కంటే బొబ్బిలిలో వేతనాలు ఎక్కువ ఇస్తున్నామని వ్యాపారులు చెపుతున్నారు.